సాక్షి అనంతపురం

బుధవారం । 21 । ఆగస్టు । 2024



చీనీ టన్ను రూ.21,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.21,500 పలికాయి.



టమాట కిలో రూ.21

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.21 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.15 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.6°/23.8°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత అధికంగా ఉంది. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిశాయి.

రౌడీ రాజ్యం

- తాడిపత్రిలో కొనసాగుతున్న టీడీపీ అరాచకం
- తాజాగా జేసీ ఆదేశాలతో రెచ్చిపోయిన పచ్చమూకలు
- జీ హుజూర్ అన్న పోలీసులు
- గత ఐదేళ్లూ ప్రశాంతంగా ఉన్న పట్టణంలో మళ్లీ అలజడి
- బిక్కుబిక్కుమంటున్న ప్రజలు



టీడీపీ మూకల దాడిలో ధ్వంసమైన కందిగోపుల మురళి వాహనాలు

అనంతపురం టాస్క్‌ఫోర్స్: గత ఐదేళ్లూ ప్రశాంతంగా ఉన్న తాడిపత్రి పట్టణంలో మళ్లీ అలజడి మొదలైంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక రౌడీ రాజ్యం వచ్చింది. జేసీ ఆదేశాలతో 'పచ్చ' రౌడీలు రెచ్చిపోతున్నారు. పౌర స్వేచ్ఛకు భంగం కలగకుండా చూడాల్సిన పోలీసులు కూడా టీడీపీ నేతల ఆదేశాలకు లోబడి తాము ప్రజా సేవకులం కాదు, కేవలం నాయకుల సేవకులం మాత్రమే అని పోటీ పడి మరీ అత్యుత్సాహం ప్రదర్శిస్తుండడంతో స్థానికులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

జేసీ ఆదేశాలతో అరాచకం..

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి వచ్చిన సందర్భంగా మంగళవారం టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. మారణాయుధాలతో హల్‌చల్ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. మూడు నెలల అనంతరం కేతిరెడ్డి పెద్దారెడ్డి మంగళవారం సాయంత్రం తాడిపత్రి వచ్చారు. ఈ క్రమంలో జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆదేశాలతో 'పచ్చ' రౌడీలు దాదాపు 70 మంది వరకు పెద్దారెడ్డి నివాసం సమీపంలోకి చేరుకున్నారు. ఆయన ఇంటిపై దాడి చేయాలని ప్రయత్నించారు. వీరిని పోలీసులు కట్టడి చేయలేకపోయారు. ఈ క్రమంలోనే రఫీ అలియాస్ అడ్డు రఫీ అనే వైఎస్సార్ సీపీ కార్యకర్తపై పచ్చ మూక రాళ్లతో అత్యంత పాశవికంగా దాడికి దిగింది. తీవ్రంగా గాయపడిన బాధితుడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. పచ్చ మూకలు ఇష్టారాజ్యంగా దాడులు చేస్తున్నా పోలీసులు నిలువరించలేదు.

ప్రాణాలతో బయటపడ్డ కందిగోపుల...

రఫీపై దాడి అనంతరం వైఎస్సార్ సీపీ నాయకుడు కందిగోపుల మురళీ ప్రసాద్‌రెడ్డి ఇంటిపైకి దూసుకెళ్లి విధ్వంసమే సృష్టించారు. ఇంటి ముందు ఉన్న మురళీ ఇన్నోవా వాహనం, ఓ ద్విచక్రవాహనాన్ని ధ్వంసం చేసి ఇంటి తలుపులు బద్దలు కొట్టి, మారణాయుధాలు, రాళ్లతో ఇంట్లోకి చొచ్చుకెళ్లారు. ఇంట్లో ఫర్నీచర్‌ను ధ్వంసం చేసి, నిప్పు పెట్టారు. భయభ్రాంతులకు గురైన కందిగోపుల మురళీ ప్రసాద్ రెడ్డి ఇంట్లోని ఓ రూంలో తన భార్యతో కలసి దాక్కుని ప్రాణాలు నిలుపుకున్నారు. దీన్ని బట్టి పచ్చ మూకలు ఎంతగా రెచ్చిపోయాయో అర్థం చేసుకోవచ్చు.



వైఎస్సార్ సీపీ నేత కందిగోపుల మురళీప్రసాద్ రెడ్డి ఇంట్లో ఫర్నీచర్ ధ్వంసం చేసిన దృశ్యం

2009లోనూ ఆస్తుల ధ్వంసం...

కందిగోపుల మురళీ ప్రసాద్ రెడ్డి టీడీపీలో సీనియర్ నాయకుడిగా ఉన్న సమయంలో జేసీ ప్రభాకర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉండేవారు. నాడు ఇదే కందిగోపుల మురళీ ప్రసాద్‌రెడ్డి ఇంటికి అప్పట్లో జేసీ ప్రభాకర్ రెడ్డి తన వర్గీయుల చేత నిప్పు పెట్టించి ఆస్తుల దహనానికి పాల్పడ్డారు. మళ్లీ అదే తరహాలో నేడు పచ్చ రౌడీలతో పాశవిక చర్యలకు పాల్పడ్డారు.

వైఎస్సార్ సీపీ పాలనలో ప్రశాంత జీవనం..

2019 నుంచి 2024 మే వరకు తాడిపత్రిలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా కేతిరెడ్డి పెద్దారెడ్డి ఉన్న ఐదేళ్లూ ఎలాంటి ఘర్షణలు, హత్యలు జరగలేదని, ప్రశాంతంగా జీవించామని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చి కేవలం 3 నెలల వ్యవధిలోనే జేసీ ప్రోద్బలంతో అరాచకాలకు తెగబడుతున్న గూండాలను చూసి, ముస్ముందు ఇంకా ఎలాంటి దారుణాలను చూడాల్సి వస్తుందోనన్న భయంతో ప్రజలు కాలం వెళ్లదీస్తున్నారు.

ప్రతిపక్ష పార్టీ నాయకులపైనే కేసులు!

టీడీపీ నేతలకు పోలీసులు జీ హుజూర్ అంటున్నారు. రెచ్చిపోతున్న వారిని వదిలి అమాయకులను బలి చేస్తున్నారు. మంగళవారం పట్టణంలో వైఎస్సార్ సీపీ శ్రేణులపై టీడీపీ రౌడీలు దాడులకు తెగబడడంతో పాటు ఆస్తుల విధ్వంసానికి పాల్పడితే పోలీసులు మాత్రం బాధితులపైనే అక్రమ కేసులు పెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

నన్ను అంతం చేసేందుకే..

- గతంలో మా అన్ననూ హత్య చేశారు
- మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



తాడిపత్రి అర్బన్: 'కూటమి ప్రభుత్వం వచ్చాక మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు టీడీపీ నాయకులు తెరలేపారు. ఈ క్రమంలో తాడిపత్రిలో నేను ఉంటే వారి ఆటలు సాగవని గ్రహించి నన్ను అంతమొందించేందుకు దాడులు చేయించారు' అని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. అనంతపురంలో మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యక్తిగత పని నిమిత్తం జిల్లా ఎస్పీ అనుమతితోనే తాను తాడిపత్రి వెళ్లానన్నారు. ఎన్నికల సమయంలో తాడిపత్రిలో అల్లర్లు సృష్టించిన టీడీపీ నాయకులను అరెస్టు చేయకపోవడంతోనే నేడు దాడులు జరిగాయన్నారు. ఎన్ని కుట్రలు చేసినా భయపడేది లేదన్నారు. రాజకీయంగా అడ్డుగా ఉన్నాడని గతంలో తమ సోదరుడిని హత్య చేశారన్నారు. ఈ కేసులో జేసీ కుటుంబీకులు నిందితులుగా ఉన్నారన్నారు. నేడు నన్ను లొంగదీసుకునేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. ఊపిరి ఉన్నంత వరకూ తాడిపత్రి వాసులతోనే తన ప్రయాణమని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులకు అండగా ఉంటామన్నారు. మురళీ ప్రసాద్ రెడ్డి ఇంటిపై దాడికి పాల్పడడం నీచమన్నారు. తాడిపత్రిలో జరుగుతున్న అరాచకాలపై ఇప్పటికే మానవ హక్కుల సంఘానికి కూడా ఫిర్యాదు చేసినట్లు మాజీ ఎమ్మెల్యే తెలిపారు.

పరిస్థితిని సమీక్షించిన ఎస్పీ

తాడిపత్రి అర్బన్: తాడిపత్రిలో ఉద్రిక్తత చోటు చేసుకున్న నేపథ్యంలో ఎస్పీ జగదీష్ మంగళవారం రాత్రి హుటాహుటిన పట్టణానికి చేరుకున్నారు. ఘటనపై డీఎస్పీ జనార్దననాయుడుతో ఆరా తీశారు. వైఎస్సార్ సీపీ నేత కందిగోపుల మురళీప్రసాద్‌రెడ్డి తన భార్యతో కలిసి అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని జరిగిన దాడిపై ఎస్పీకి ఫిర్యాదు చేశారు. రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇదిలావుండగా, ఎన్నికల అనంతరం జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు జాగ్రత్తలు చేపట్టారు. ఇప్పటికే తాడిపత్రికి అదనపు బలగాలు చేరుకున్నాయి. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి నివాసంతో పాటు వైఎస్సార్ సీపీ నాయకుడు కందిగోపుల మురళీప్రసాద్ రెడ్డి ఇంటి వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

న్యూస్‌రీల్

నిత్యం అప్రమత్తంగా ఉండాలి

- స్పెషల్ బ్రాంచ్‌కు ఎస్పీ జగదీష్ ఆదేశం



అనంతపురం సెంట్రల్: అసాంఘిక కార్యకలాపాల కట్టడికి నిత్యం అప్రమత్తంగా పనిచేయాలని ఎస్పీ పి. జగదీష్ ఆదేశించారు. మంగళవారం పోలీసు కాన్ఫరెన్సు హాలులో జిల్లాలోని స్పెషల్ బ్రాంచ్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్కా, పేకాట, నిషేధిత గుట్కా విక్రయాలు, రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలన్నారు. ఫ్యాక్షన్, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో సీఐ ధరణీకిశోర్, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షలు వాయిదా

అనంతపురం సెంట్రల్: ఎస్కేయూలో బుధవారం జరగాల్సిన ఎంబీఏ నాలుగో సెమిస్టర్, పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు వాయిదా పడ్డాయి. భారత్ బంద్ సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పరీక్షల విభాగం సంచాలకులు ఆచార్య జీవీ రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న పరీక్షలుంటాయని, ఈ విషయాన్ని అభ్యర్థులు గమనించాలని కోరారు.

మునిసిపల్ పీఠం కోసం టీడీపీ కుయుక్తులు



చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేసినట్లు చూపుతున్న ఇంద్రజ

హిందూపురం: రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నాయకులు దిగజారుడు రాజకీయం చేస్తున్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ నామరూపాలు లేకుండా పోగా.. ఇప్పుడు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ ఉనికి చాటుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే హిందూపురం మునిసిపాలిటీలో సంపూర్ణ మెజార్టీతో ఉన్న వైఎస్సార్ సీపీని టార్గెట్ చేశారు. మునిసిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజతో పాటు మరో 8 మంది కౌన్సిలర్లను టీడీపీలో చేర్చుకున్నారు. తాజాగా మంగళవారం చైర్‌పర్సన్ ఇంద్రజ తన పదవితో పాటు వైఎస్సార్‌సీపీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. టీడీపీ కౌన్సిలర్లతో కలిసి మునిసిపల్ కార్యాలయానికి వచ్చిన ఆమె.. చైర్‌పర్సన్ స్థానంలో కూర్చుని తన రాజీనామా గురించి తెలియజేశారు. అనంతరం రాజీనామా పత్రాన్ని మీడియాకు చూపారు. మూడున్నరేళ్లుగా మునిసిపల్ చైర్‌పర్సన్‌గా కొనసాగిన తాను.. వ్యక్తిగత కారణాలతో పదవితో పాటు పార్టీకి రాజీనామా చేశానని వెల్లడించారు.

కుందుర్పి చెన్నకేశవ ఆలయం పరిశీలన



ఆలయంలో నాగబంధాన్ని పరిశీలిస్తున్న జిల్లా పురావస్తు సహాయ సంచాలకులు రజిత

సాక్షి ఎఫెక్ట్..

కళ్యాణదుర్గం/కుందుర్పి: కుందుర్పి సమీపంలోని పురాతన చెన్నకేశవాలయాన్ని మంగళవారం జిల్లా పురావస్తు, ప్రదర్శన శాఖ సహాయ సంచాలకులు (టెక్నికల్) డాక్టర్ వి.రజిత, సాంకేతిక సహాయకులు బి.మహేంద్ర నాయుడు పరిశీలించారు. ఆలయ ముఖద్వారంలో నాగబంధం ఉండడంపై 'సాక్షి'లో ఇటీవల కథనం వెలువడింది. ఈ క్రమంలో రాష్ట్ర పురావస్తు శాఖ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ఆలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ వి. రజిత మాట్లాడుతూ చెన్నకేశవ ఆలయాన్ని వైష్ణవాలయంగా గుర్తించామన్నారు. ఆలయం చుట్టూ గోడలకు నాగ ప్రతిమలు, ఏనుగుల శిల్పాలు ఉన్నాయన్నారు. ఆలయం లోపలి వాతావరణం పరిశోధనకు అనువుగా లేకపోవడంతో నాగబంధంపై మరోసారి సమగ్ర పరిశీలనకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అనంతరం మండలంలో మలయనూరులోని పంచ శివాలయాలను అధికారులు సందర్శించారు. శిల్పకళను పరిశీలించారు. కుందుర్పి, మలయనూరులో ఉన్న వైష్ణవాలయాలను పరిరక్షించేందుకు జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

సైన్స్ సెంటర్ అధికారిపై డీఈఓ చిందులు



అనంతపురం ఎడ్యుకేషన్: వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంటూ విద్యాశాఖలో తీవ్ర చర్చకు దారి తీస్తున్న డీఈఓ వరలక్ష్మి వైఖరితో మరో ప్రధానోపాధ్యాయుడు భంగపాటుకు గురయ్యారు. మనస్తాపానికి గురైన ఆయన తనను సైన్స్ సెంటర్ అధికారి పదవి నుంచి తప్పించాలంటూ గట్టిగా బదులిచ్చినట్లు తెలిసింది. మంగళవారం జరిగిన ఈ వ్యవహారం విద్యాశాఖలో హాట్‌టాపిక్‌గా మారింది. విశ్వసనీయ సమాచారం మేరకు... జిల్లా కేంద్రంలోని సైన్స్ సెంటర్ అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. ఈ క్రమంలో నెలలోపు సైన్స్ సెంటర్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడంతో పాటు అవసరమైన సైన్స్ పరికరాలను కొనుగోలు చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. ఇందుకోసం 10 మంది సభ్యులతో కమిటీని నియమించారు. డీఈఓతో పాటు సమగ్ర శిక్ష ఏపీసీ, ఏడీలు, డిప్యూటీ డీఈఓలు, ఎంపిక చేసిన ఇద్దరు హెచ్‌ఎంలు, ఇద్దరు సైన్స్ అసిస్టెంట్లు ఉన్నారు. మంగళవారం సైన్స్ సెంటర్‌లో కమిటీ సమావేశమైంది. అత్యవసర పనులను గుర్తించి వాటికి రూ. 1.71 లక్షలు ఖర్చు చేసేందుకు కమిటీ సభ్యులు తీర్మానం చేశారు. ఇందుకు సంబంధించిన ఫైలును అనుమతుల కోసం డీఈఓ వరలక్ష్మి వద్దకు సైన్స్ సెంటర్ అధికారి బాలమురళీకృష్ణ తీసుకెళ్లారు. అయితే, ఫైలులో 10 మందికి గాను 9 మంది సభ్యుల సంతకాలు ఉండడం గుర్తించిన డీఈఓ సైన్స్ సెంటర్ అధికారిపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది ఎదుట అవమానపరిచేలా మాట్లాడంతో బాలమురళీకృష్ణ మనస్తాపానికి గురయ్యారు. తనను ఆ పోస్టు నుంచి తప్పించాలని గట్టిగా చెప్పేసి అక్కడి నుంచి వెళ్లినట్లు తెలిసింది. కమిటీలో సభ్యుడైన అనంతపురం డీవైఈఓ శ్రీనివాసరావు టీచర్ల సర్దుబాటు పనిలో విడపనకల్లులో ఉండిపోయారని, తాను వచ్చిన తర్వాత సంతకం చేస్తానని చెప్పినట్లు తెలిసింది. కలెక్టర్ అత్యంత సీరియస్‌గా తీసుకున్న ప్రాజెక్ట్ కావడంతో గడువులోగా పనులు చేయించాలనే సంకల్పంతో కమిటీ ఆమోదం మేరకు ఫైలు పెడితే డీఈఓ ఇలా మాట్లాడారని బాలమురళీకృష్ణ బాధపడినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై డీఈఓ, సైన్స్ సెంటర్ అధికారితో మాట్లాడేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

లక్ష్యం మేరకు రుణాలివ్వాల్సిందే

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం సిటీ: లక్ష్యం మేరకు అర్హులకు రుణాలివ్వాల్సిందేనని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. అనంతపురం జెడ్పీ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్‌సీ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రైతు రుణాలు సకాలంలో అందించాలన్నారు. మరింత మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై బ్యాంకర్లకు కనీస అవగాహన ఉండడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబిల్ స్కోర్ సాకుతో చిరుద్యోగులు, నిరుద్యోగ యువత ఆశలపై బ్యాంకర్లు నీళ్లు చల్లుతున్నారని, ఇటువంటి ధోరణులు మంచివి కాదని హెచ్చరించారు. ఎల్‌డీఎం నరసింగరావు, లీడ్ జిల్లా అధికారి గిరిధర్, నాబార్డు ఏజీఎం అనూరాధ, జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలకు పూర్తి సహకారం

పారిశ్రామికవేత్తలకు అన్ని విధాల సహకారం అందిస్తామని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో జరిగింది. ఆయన మాట్లాడుతూ కొత్త పరిశ్రమల స్థాపన, ఉన్నవాటి విస్తరణకు ముందుకు వచ్చే వారికి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సంపూర్ణ సహకారాన్ని అందిస్తామన్నారు. సమావేశంలో పరిశ్రమల శాఖ అధికారి నాగరాజారావు, చేనేత జౌళి శాఖ ఏడీ అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

మహిళలకు లక్‌పతి దీదీ పథకం

మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం లక్‌పతి దీదీ పథకాన్ని అమలు చేస్తోందని కలెక్టర్ తెలిపారు. పథకం అమలుపై కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. నైపుణ్యాభివృద్ధిపై మహిళలకు అవగాహన కల్పించి, జీవనోపాధుల కల్పనకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. స్త్రీనిధి, ఉన్నతి, తదితర పథకాల కింద రుణాలు మంజూరు చేయాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ ఓబుళమ్మ, జేడీఏ ఉమామహేశ్వరమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కార్యకలాపాలు విస్తృతం చేయండి

జిల్లాలో మత్స్యశాఖ కార్యకలాపాలను విస్తృతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మత్స్యశాఖ చేపడుతున్న కార్యకలాపాలపై మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. మత్స్య పరిశ్రమ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనే మత్స్యకారులను గుర్తించి లైసెన్స్ జారీ చేయాలన్నారు. మినీ ఫిష్ వెండింగ్ యూనిట్లు, సెంటర్ల ఏర్పాటుకు లబ్ధిదారులను గుర్తించాలన్నారు. మత్స్యశాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, మత్స్యశాఖ ఈడీ శ్రీనివాసనాయక్, ఎఫ్‌డీఓలు ఫకీరయ్య, లక్ష్మీనారాయణ, ఆసీఫ్, సూపరింటెండెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

చెత్త నిర్వహణ సక్రమంగా చేపట్టండి

అనంతపురం కార్పొరేషన్: కంపోస్టు యార్డులో చెత్త నిర్వహణ (చెత్త వేరు చేసే)ను సక్రమంగా చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నగర శివారులోని గుత్తి రోడ్డులో ఉన్న కంపోస్టు యార్డును మంగళవారం ఆయన పరిశీలించి, మాట్లాడారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో పొడి, తడి చెత్త సేకరణ చేయాలని, అన్ని చోట్ల పనులు ప్రారంభించేలా చూడాలని మునిసిపల్ ఆర్‌డీ పీవీవీఎస్ మూర్తిని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఇన్‌చార్జ్ ఎస్‌ఈ సూర్యనారాయణ, డీఈ సుభాష్, తహసీల్దార్ హరిప్రసాద్ ఉన్నారు.

మన ట్రాక్టర్లే .. వదిలెెయ్!

- పోలీసు, రెవెన్యూ అధికారులపై ఇసుక అక్రమార్కుల ఒత్తిళ్లు



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

కళ్యాణదుర్గం: 'హలో సీఐ గారూ....హలో తహసీల్దార్ గారూ.. పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు మనోళ్లవే.. వాటిని వదిలేయండి' అంటూ అటు పోలీసులు, ఇటు రెవెన్యూ అధికారులకు టీడీపీ ముఖ్య నేతలు ఫోన్లు చేయడం హాట్ టాపిక్‌గా మారింది. మంగళవారం ఉదయం బెళుగుప్ప మండలం నరసాపురం నుంచి మూడు ట్రాక్టర్లు ఎలాంటి అనుమతులు లేకుండానే కళ్యాణదుర్గం పట్టణానికి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నాయి. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు మూడు ట్రాక్టర్లను గూబనపల్లి వద్ద పట్టుకున్నారు. అక్కడి నుంచి పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అయితే అప్పటికే టీడీపీ నేతలు పట్టణ సీఐ, పోలీసు సిబ్బందికి ఫోన్లు చేసి ట్రాక్టర్లను వదిలేయాలని హుకుం జారీ చేశారు.

చూసీ చూడనట్లుగా ఉండండి..

పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు ఏపీ39 ఎస్ఎల్ 0106, ఏపీ39 టీడీ 8238, ఏపీ39 టీఎక్స్ 044 (నంబర్ అసంపూర్తిగా ఉంది)పై చూసీ చూడనట్లుగా ఉండాలని బెళుగుప్ప, ఉరవకొండ ప్రాంతాల నుంచి టీడీపీ నేతలు పోలీసులకు ఫోన్లు చేసినట్లు సమాచారం. తమ పార్టీకి చెందిన వారివేనని, వెంటనే వదిలిపెట్టాలని టీడీపీ పెద్దల నుంచి సైతం ఆదేశాలొచ్చాయి. ఈ క్రమంలోనే విషయం అందరికీ తెలిసిపోవడంతో ట్రాక్టర్లను ఎలా వదిలిపెట్టాలన్న దానిపై అటు పోలీసులు, ఇటు రెవెన్యూ అధికారులు తలలు పట్టుకున్నారు.

అధికారులు.. కథలు..

పట్టుబడిన ట్రాక్టర్లలో రెండింటికీ మినహా ఓ ట్రాక్టర్‌కు సరైన నంబర్ లేదు. ఇసుక తరలిస్తున్న ట్రాలీ నంబర్లు, ఇంజిన్ నంబర్లు వేర్వేరుగా ఉన్నాయి. రెండు ట్రాలీలకు అసలు నంబరే లేదు. దీనిపై విలేకరులు పట్టణ పోలీసులను ప్రశ్నించగా అన్ని రికార్డులు సక్రమంగా ఉన్నాయని, ప్రభుత్వ భవనాలకు రవాణా చేస్తున్నారంటూ చెప్పడం గమనార్హం. ఈ క్రమంలోనే తహసీల్దార్‌ను వివరణ కోరగా పట్టుబడిన ట్రాక్టర్ల యజమానులు రాలేదని అక్రమంగా తరలిస్తున్నారని తెలిస్తే ఒక్కో ట్రాక్టర్‌కు రూ.10 వేలు జరిమానా విధిస్తామని చెప్పారు. అయితే సాయంత్రానికి తిరిగి రెవెన్యూ అధికారులే ట్రాక్టర్ల అనుమతులు ఉన్నాయని, రికార్డులు తెచ్చేందుకు వెళ్లారంటూ మాటమార్చడం పలు అనుమానాలకు తావిస్తోంది.

కుమ్మేసిన వాన

- జిల్లా అంతటా భారీ వర్షం
- గార్లదిన్నెలో కుండపోత
- ఒకే రోజు 44.7 మి.మీ నగటు వర్షపాతం నమోదు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా అంతటా భారీ వర్షం కురిసింది. సోమవారం అర్ధరాత్రి నుంచి ఉరుములు, మెరుపులతో 31 మండలాల పరిధిలో ఏకంగా 44.7 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. గార్లదిన్నె మండలంలో కుండపోత వర్షం (126 మి.మీ) పడింది. బ్రహ్మసముద్రం 71.4 మి.మీ, యల్లనూరు 70.8 మి.మీ, పామిడి 65.4 మి.మీ, బుక్కరాయసముద్రం 59 మి.మీ, రాప్తాడు 57.8 మి.మీ, గుత్తి 55.6 మి.మీ, పుట్లూరు 54.8 మి.మీ, రాయదుర్గం 54.2 మి.మీ, పెద్దవడుగూరు 52.4 మి.మీ, తాడిపత్రి 50.4 మి.మీ వర్షం కురిసింది. ఆత్మకూరు 47.2 మి.మీ, విడపనకల్లు 43.6 మి.మీ, గుంతకల్లు 42.2 మి.మీ, యాడికి 42 మి.మీ, డి.హీరేహాళ్ 40.6 మి.మీ, కుందుర్పి 40.6 మి.మీ, శెట్టూరు 40.4 మి.మీ, అనంతపురం 38.4 మి.మీ, కళ్యాణదుర్గం 37.4 మి.మీ, పెద్దపప్పూరు 37.2 మి.మీ, శింగనమల 35.6 మి.మీ, కణేకల్లు 34 మి.మీ, కూడేరు 31.2 మి.మీ, బెళుగుప్ప 30.6 మి.మీ, గుమ్మఘట్ట 29.4 మి.మీ, బొమ్మనహాళ్ 27.2 మి.మీ, కంబదూరు 24.6 మి.మీ, ఉరవకొండ 21.6 మి.మీ, నార్పల 17.6 మి.మీ, వజ్రకరూరు 7.4 మి.మీ వర్షం కురిసింది. ఆగస్టు సాధారణం 83.8 మి.మీ కాగా ఇప్పటికే 156.9 మి.మీ నమోదైంది. ఖరీఫ్‌లో జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 176.1 మి.మీ కాగా 86.8 శాతం అధికంగా 329 మి.మీ నమోదైంది. 23 వర్షపు రోజులు (రెయినీడేస్) నమోదయ్యాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు చాలా ప్రాంతాల్లో వాగులు, వంకలు, చెక్‌డ్యాంలు నిండిపోయాయి.



గుత్తి మండలం లచ్చానుపల్లి వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

ప్రత్యామ్నాయం ఏదీ..?

వర్షాభావంతో ఖరీఫ్ సాగు తగ్గిపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు సిద్ధంగా ఉన్నారు. ప్రభుత్వం 80 శాతంతో ఉలవలు, అలసందలు, పెసలు, జొన్నలు, కొర్రలు, మినుములు ఇస్తామని ప్రకటించినా.. ఇప్పటి వరకు క్వింటా కూడా సరఫరా చేయలేదు. సొంతంగానే కొనుగోలు చేద్దామన్నా ఇన్సూరెన్స్, సుభీభవ, గత రబీకి సంబంధించి ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయకపోవడం సమస్యగా మారింది. వ్యవసాయశాఖ ఇచ్చే విత్తనాలు, పరిహారం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

786 హెక్టార్లలో పంట నష్టం

వర్షాలకు 786 హెక్టార్లలో పంటనష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ జేడీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. 15 మండలాలు, 38 గ్రామాల పరిధిలో 174 హెక్టార్లలో వేరుశనగ, 163 హెక్టార్లలో మొక్కజొన్న, కంది 138 హెక్టార్లు, 195 హెక్టార్లలో దెబ్బతిన్నాయన్నారు. వరి, పత్తి, మినుము, సోయాబీన్ తదితర పంటలు దెబ్బతిన్నట్లు తెలిపారు. రూ.1.56 కోట్లు పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశామన్నారు. అలాగే, ఉద్యాన పంటలకు రూ. 1.43 కోట్ల నష్టం వాటిల్లినట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

కవితా సంపుటాల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: 'కొత్తపల్లి నరేంద్ర బాబు సాహిత్య పురస్కారం -2024'కు కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు నిర్వాహకులు కొత్తపల్లి సురేష్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏటా ఉత్తమ రచనలకు కవి సమ్మేళనం సాహిత్య వేదిక ఆధ్వర్యంలో పురస్కారాలను అందజేస్తున్నట్లు గుర్తు చేశారు. ఈ క్రమంలో ఈ ఏడాదికి సంబంధించి కవితా సంపుటాలను సెప్టెంబర్ 10వ తేదీలోపు 'కొత్తపల్లి సురేష్, డోర్.నం. 33-129-1, ఓవీఆర్ కాలనీ, కళ్యాణదుర్గం రోడ్డు, అనంతపురం' చిరునామాకు చేరేలా పంపాలన్నారు. 2023లో ప్రచురితమైన కవితా సంపుటాలను మాత్రమే పోటీలకు స్వీకరిస్తామన్నారు. పూర్తి వివరాలకు 94938 32470లో సంప్రదించాలని కోరారు.

టమాట రైతులను ఆదుకోండి



డీఆర్ఓ రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం అర్బన్: నగర శివారులోని కక్కలపల్లి టమాట మార్కెట్‌లో అక్రమ వసూళ్లపై సమగ్ర విచారణ చేపట్టి రైతులను ఆదుకోవాలని డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డికి సీపీఎం నాయకులు విన్నవించారు. ఈ మేరకు డీఆర్ఓని మంగళవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, ఇతర నాయకులు కలసి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. మండీ నిర్వాహకులు వసూలు చేస్తున్న పది శాతం కమీషన్, అసోసియేషన్ పేరిట లారీల నుంచి వసూలు చేస్తున్న డబ్బుకు సంబంధించి మొత్తం భారాన్ని రైతులపై మోపడం భావ్యం కాదన్నారు. బయటి వ్యాపారులను, లారీలను రానివ్వకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. వీటిపై జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నల్లప్ప, నాగేంద్రకుమార్, బాలరంగయ్య, ఆర్వీనాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా జడ్జిని కలిసిన ఎస్పీ



జిల్లా జడ్జి శ్రీనివాస్‌కు పూల మొక్కను అందిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం సెంట్రల్: జిల్లా జడ్జి శ్రీనివాస్‌ను ఆయన చాంబర్‌లో నూతన ఎస్పీ పి.జగదీష్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్క అందజేసి, పలు అంశాలపై చర్చించారు.

ఒక్క పరికరం ఉంటే ఒట్టు!

- విద్యుత్ శాఖలో మెటీరియల్ కొరత
- రూ.లక్షలు చెల్లించినా కనెక్షన్ మంజూరుకు తప్పని అదనపు చెల్లింపులు
- సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోని విద్యుత్ శాఖ అధికారులు

- రుద్రంపేటకు చెందిన మణి తన నాలుగంతస్తుల బిల్డింగ్‌కు విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. పరిశీలించిన అధికారులు 25 కిలో వాట్ సామర్థ్యమున్న ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు స్తంభాలు, కండక్టర్ ఇతర మెటీరియల్ కావాల్సి వస్తుందని దాదాపు రూ.3లక్షలకు పైగా ఎస్టిమేషన్ వేసి ఇవ్వడంతో.. ఆ మొత్తాన్ని మణి చెల్లించాడు. విద్యుత్ కనెక్షన్ ఇవాల్సిన సమయం వచ్చిన తర్వాత స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ మినహా మిగిలిన ఏ మెటీరియల్ తమ వద్ద లేదని, కనెక్షన్ కావాలనుకుంటే రూ.50 వేలు చెల్లిస్తే ప్రైవేట్‌గా కొనుగోలు చేసి తీసుకువస్తామని తెలిపారు. దీంతో ఆ మొత్తాన్ని కూడా మణి చెల్లించుకోకతప్పలేదు.
- అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లి గ్రామ సమీపంలో ఓ వెంచర్ నిర్వాహకుడు 10 కేవీ ట్రాన్స్‌ఫార్మర్, 11కేవీ విద్యుత్ సౌకర్యం కోసం రూ.2.50లక్షలు చెల్లించాడు. దీంతో విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్ స్తంభాలను మాత్రమే అందించారు. మిగిలిన ఏ మెటీరియల్‌ను ఇవ్వలేదు. అరా తీస్తే విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంలో మెటీరియల్ అందుబాటులో లేదని, వచ్చిన తర్వాత ఇస్తామని అధికారులు తెలిపారు. మెటీరియల్ అందుబాటులో లేనప్పుడు ముందస్తుగానే డబ్బు ఎలా కట్టించుకుంటారంటూ అధికారులను ఆయన నిలదీసినా ప్రయోజనం లేకుండా పోయింది.

అనంతపురం టౌన్: విద్యుత్ సంస్థలో పరికరాలు (మెటీరియల్) అందుబాటులో లేవు. దాదాపు నెల రోజులకు పైగా కావస్తున్నా అధికారులు ఇండెంట్ పెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఫలితంగా విద్యుత్ కనెక్షన్ కావాలంటే వినియోగదారులు అదనపు డబ్బు చెల్లించాల్సి వస్తోంది. ఒక స్తంభం నుంచి మరో స్తంభానికి విద్యుత్ తీగలు లాగాలంటే 25 కిలోలకు పైగా కండక్టర్ అవసరం ఉంటుంది. ఈ లెక్కన ఒక కిలో కండక్టర్ (విద్యుత్ తీగలు) కోసం రూ.470కి పైగా విద్యుత్ అధికారులు ఎస్టిమేషన్‌లో నమోదు చేసి వినియోగదారుడితో కట్టించుకుంటున్నారు. విద్యుత్ అవసరం ఉన్న వినియోగదారుని ఇంటి దూరాన్ని బట్టి ఎన్ని స్తంభాలు అవసరం అవుతాయో లెక్క కట్టి ఎస్టిమేషన్‌ను అధికారులు రూపొందించి ఇస్తారు. ఆ మేరకు లెక్క చెల్లించిన తర్వాతనే పని మొదలు పెడతారు.

అసలు విషయం దాచి...

విద్యుత్ శాఖలో మెటీరియల్ కొరత ఉన్న విషయాన్ని ఏ దరఖాస్తుదారుకూ అధికారులు ముందస్తుగా తెలపకపోవడం గమనార్హం. ఎస్టిమేషన్ మొత్తాన్ని చెల్లించిన తర్వాత మెటీరియల్ లేదంటూ రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పుకుంటారు. చివరకు వినియోగదారుడిని విసుగు చెందేలా చేసి ఆ మెటీరియల్‌ను ప్రైవేట్‌గా కొనుగోలు చేసేలా ఒప్పించి, అంత మొత్తం లాగేస్తున్నారు. మెటీరియల్ కొరత ఏర్పడి దాదాపు రెండు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకూ అధికారులు ఇండెంట్ పెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. కిలో కండక్టర్‌కు రూ.470, ఒక డిస్క్‌కు రూ. 350, 11 కేవీ ఇన్సులేటర్లకు రూ. 450, అర్త్ పైపు ఒక్కొక్కటి రూ. 4వేలు, బోల్టులు ఇతర సామగ్రికి సంబంధించి మొత్తాన్ని ముందుగానే వినియోగదారుడితో కట్టించుకున్న అధికారులు చివరకు వాటిని అదే వినియోగదారుడితో ప్రైవేట్‌గా కొనుగోలు చేయిస్తున్నారు. దీంతో రూ.50వేల నుంచి రూ.70 వేల వరకూ అదనపు ఖర్చు భరించాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు.



విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయం

నివేదిక పంపాం



మెటీరియల్ కొరత ఉన్న మాట వాస్తవమే. నేను బాధ్యతలు తీసుకున్న తర్వాత ఇటీవల మెటీరియల్‌ను భద్రపరిచే స్టోర్ రూంను పరిశీలించా. వినియోగదారులకు అవసరమైన చాలా మెటీరియల్ అందుబాటులో లేదు. దీంతో వాటి కోసం నివేదిక సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపాం. త్వరలో మెటీరియల్ అందుబాటులోకి వస్తుంది.

– సంపత్‌కుమార్, ఎస్ఈ, విద్యుత్ శాఖ

డ్రిప్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం



మంటలు ఆర్పుతున్న దృశ్యం

కళ్యాణదుర్గం: స్థానిక కంబదూరు రోడ్డులో ఉన్న కిసాన్ డ్రిప్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. రైతుల నుంచి అత్యధిక మోతాదులో కొనుగోలు చేసిన స్క్రాప్ డ్రిప్ పైపులను ఫ్యాక్టరీ సమీపంలో నిర్వాహకులు డంప్ చేసి ఉంచారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో మంటలు చుట్టుముట్టాయి. నిర్వాహకుడు సాయికుమార్ సమాచారమివ్వడంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసింది. ఈలోపు రూ.22 లక్షలకు పైగా విలువైన దాదాపు 40 టన్నుల డ్రిప్ స్క్రాప్ పైపులు అగ్నికి ఆహుతయ్యాయి. రూ.80 లక్షల విలువైన డ్రిప్ పైపులను కాపాడినట్లు ఫైర్ అధికారి వసంత్‌నాయక్ తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

పరిగి: కారు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పరిగి మండలం ఊటుకూరుకు చెందిన రామాంజి (48), తన మిత్రుడు బోయ ఈశ్వర్‌తో కలసి మెదా గ్రామంలో నివాసముంటున్న సోదరితో రాఖీ కట్టించుకునేందుకు సోమవారం వచ్చాడు. సాయంత్రం ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన వారు పెద్దిరెడ్డిపల్లి సమీపంలోకి చేరుకోగానే వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొనడంతో రామాంజి అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ఈశ్వర్‌ను కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళ్లారు.

గుత్తిలో సర్దుబాటు ప్రక్రియ బహిష్కరణ

గుత్తి: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మంగళవారం చేపట్టిన సర్దుబాటు ప్రక్రియ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు బహిష్కరించి ఎంఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు నాగరాజు, ప్రసాద్, సయ్యద్ బాషా, పోతులయ్య, శంకరయ్య మాట్లాడుతూ... ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం చేయకుండా ఇష్టానుసారంగా సర్దుబాటు ప్రక్రియను చేపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. ఉపాధ్యాయుల సీనియార్టీ, ఉపాధ్యాయులు... విద్యార్థుల నిష్పత్తి వంటి వాటిని పరిగణనలోకి తీసుకోకుండా, ఉపాధ్యాయుల వ్యక్తిగత సమస్యలకు పరిష్కారం చూపకుండా అశాస్త్రీయంగా సర్దుబాటు ప్రక్రియను చేపట్టడం దుర్మార్గమన్నారు. సమస్యలన్నింటినీ పరిష్కారం చేశాకే సర్దుబాటు ప్రక్రియను చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎంఈఓ రవినాయక్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు బసవరాజు, శ్రీధర్‌గౌడ్, నారాయణ స్వామి, రమాదేవి, ఆసీఫ్ పాల్గొన్నారు.

మండలం ప్రాతిపదికన టీచర్ల సర్దుబాటు చేయాలి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ మండలాలకే పరిమితం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఆపస్ అనంతపురం జిల్లా అధ్యక్షురాలు కళ్యాణి, ప్రధాన కార్యదర్శి ఎర్రిస్వామి మాట్లాడారు. సర్దుబాటు ప్రక్రియపై రోజు రోజుకూ ఉపాధ్యాయుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోందన్నారు. మండల స్థాయిలోనే పూర్తి చేసిన తర్వాతనే డివిజనల్ స్థాయిలో ఉపాధ్యాయుల సమ్మతితో సర్దుబాటు జరపాలన్నారు. మండల స్థాయిలో ఎస్జీటీల అవసరం ఉన్నా... క్వాలిఫైడ్ ఎస్జీటీలను బలవంతంగా ఉన్నత పాఠశాలలకు కేటాయిస్తున్నారని మండిపడ్డారు. ఇదే అర్హత కలిగి ప్రమోషన్ వద్దనుకున్న ఎస్జీటీలను బలవంతంగా ఉన్నత పాఠశాలలకు పంపించడం సరికాదన్నారు. ఎస్జీటీలను ఉన్నత పాఠశాలలకు సర్దుబాటు చేసే విషయంలో వారి ఐచ్ఛికాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.



గుత్తి ఎంఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

1.31 లక్షల హెక్టార్లలో 'ప్రత్యామ్నాయం'

- వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు వివరించిన జేడీఏ ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అగ్రికల్చర్: తీవ్ర వర్షాభావం కారణంగా 1.31 లక్షల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు 27,907 క్వింటాళ్ల విత్తనం అవసరమని ప్రభుత్వానికి నివేదికలు అందజేసినట్లు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడికి జేడీఏ ఉమామహేశ్వరమ్మ వివరించారు. వ్యవసాయశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్, కమిషనర్ ఢిల్లీరావుతో కలసి మంగళవారం గుంటూరు నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయాధికారులతో మంత్రి మాట్లాడారు. ×మా హయాంలో మాత్రం ఉద్యోగుల పని తీరు మారాలి. మార్పు స్పష్టంగా కనిపించాలి¶ అంటూ వ్యవసాయాధికారులను హెచ్చరించారు. వర్షపాతం, ఖరీఫ్ పంటల స్థితిగతులు, ప్రత్యామ్నాయ పంటల సాగు, విత్తన పంపిణీ తదితర అంశాలపై సమీక్షించారు. జేడీఏ ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ... జూన్ మాసం మొదటి 15 రోజులు మంచి వర్షాలు పడ్డాయన్నారు. ఆ తర్వాత జూన్ రెండో పక్షంతో పాటు జూలై, ఆగస్టు 13 వరకూ సరైన వర్షాలు లేవన్నారు. దీంతో 61 శాతం విస్తీర్ణం అంటే 3.46 లక్షల హెక్టార్లకు గానూ 2.12 లక్షల హెక్టార్లలో వేరుశనగ, పత్తి, ఆముదం, కంది, మొక్కజొన్న తదితర పంటలు సాగులోకి వచ్చాయన్నారు. ప్రధానంగా వేరుశనగ సాధారణ సాగు 1.97 లక్షల హెక్టార్లు కాగా 89 వేల హెక్టార్లలో వేశారన్నారు. ఈ క్రమంలో 1.31 లక్షల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు సంబంధించి అత్యధికంగా 86 వేల హెక్టార్లకు ఉలవలు ప్రతిపాదించామన్నారు. మిగిలిన విస్తీర్ణంలో పెసలు, అలసందలు, జొన్నలు, కొర్రలు, మినుములు అవసరమని వివరించారు.

రబీ నుంచి ఉచిత పంటల బీమా రద్దు

అనంతరం మంత్రి మాట్లాడుతూ... ప్రస్తుతం ఉన్న ఉచిత పంటల బీమా పథకం ఈ ఖరీఫ్‌లో మాత్రమే కొనసాగిస్తామన్నారు. రబీ నుంచి గతంలో అంటే 2014-18 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన తరహాలోనే రైతు వాటా కింద పంటల బీమా పథకం అమలులోకి తెస్తామన్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగుకు 80 శాతంతో రాయితీతో విత్తనాలు అందించే చర్యలు చేపట్టాలని కమిషనర్‌కు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం శాస్త్రవేత్తలు, అధికారులతో జేడీఏ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నంద్యాలకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ జాన్సన్, జిల్లాకు చెందిన ఏఆర్ఎస్, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ విజయశంకరబాబు, డాక్టర్ జి.నారాయణ స్వామి, డాక్టర్ మల్లీశ్వరి, ఆత్మ పీడీ మద్దిలేటి, ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ సుబ్బయ్య, డివిజన్ ఏడీఏలు, టెక్నికల్ ఏఓలు పాల్గొన్నారు.



మంత్రి అచ్చెన్నాయుడు నిర్వహించిన వీసీకి హాజరైన జిల్లా వ్యవసాయ అధికారులు

భగ్గుమన్న 'నారాయణ' విద్యార్థినులు



ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థినులు

అనంతపురం ఎడ్యుకేషన్: నగర శివారులోని నారాయణ బాలికల జూనియర్ కళాశాలలో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయని, నాలుగు రోజులుగా కనీసం తాగడానికి నీళ్లులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థినులు వాపోయారు. తక్షణమే తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సమాఖ్య, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాల ఎదుట మంగళవారం విద్యార్థినులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, బీసీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ లక్షల రూపాయలను ఫీజుల రూపంలో వసూలు చేసుకున్న నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం కళాశాలలో కనీస మౌలిక వసతులు కల్పించకపోవడం బాధాకరమన్నారు. పరిమితికి మించి విద్యార్థినులను చేర్చుకోవడమే కాక, ఒక్కో గదిలో 10 నుంచి 15 మంది విద్యార్థులను ఉంచారన్నారు. గదుల్లో సరైన వెలుతురు, గాలి లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి నారాయణ బాలికల రెసిడెన్షియల్ కళాశాలలో తాగునీరు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్ధు, నగర అధ్యక్షుడు భీమేష్, నాయకులు గణేష్, సాయి, మంజు, ఉమామహేష్ సమీర్, తారక్, పవన్, నాగరాజు పాల్గొన్నారు.

వైద్యులకు బటన్ కెమెరాలు



అనంతపురం మెడికల్: కోల్‌కత్తా ఉదంతం అనంతరం అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ మెడికల్ కళాశాల పీజీ విద్యార్థులు, హౌస్ సర్జన్లకు భద్రత కల్పించేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు సర్వజనాస్పత్రిలో రాత్రి వేళ విధుల్లో పాల్గొనే పీజీ విద్యార్థులకు బటన్ కెమెరాలను అందించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో తొలి విడతలో 20 బటన్ కెమెరాల కొనుగోలుకు సిద్ధమయ్యారు.

ఉరవకొండలో చోరీ

ఉరవకొండ: స్థానిక భద్రప్ప బావి వద్ద ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. వివరాలు... వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలోని అద్దె ఇంట్లో నివాసముంటున్న ఒంటరి మహిళ వాణి వారం రోజుల క్రితం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లో ఉన్న తన కుమార్తె వద్దకు వెళ్లింది. విషయాన్ని గమనించిన దుండగులు సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంటి తాళం బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు. బీరువాను ధ్వంసం చేసి నగదు, బంగారు నగలు అపహరించుకెళ్లారు. మంగళవారం ఉదయం విషయాన్ని గుర్తించిన పక్కింటి వారు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. హైదరాబాద్‌లో ఉన్న వాణితో ఫోన్‌లో మాట్లాడారు. బీరువాలో 10 తులాల బంగారంతో పాటు రూ.2లక్షల నగదు ఉన్నట్లు ఆమె ఫోన్‌లో తెలిపింది. ఘటనపై సీఐ సురేష్‌బాబు మాట్లాడుతూ... బాధితురాలు వచ్చి ఫిర్యాదు చేసిన తర్వాత కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడతామని పేర్కొన్నారు.

కెనరా బ్యాంక్ ఎదుట మహిళల ఆందోళన



ప్రధాన రహదారిపై బైఠాయించిన మహిళలు

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక అనంతపురం రోడ్డులో ఉన్న కెనరా బ్యాంక్ (సిండికేట్) శాఖ వద్ద సోమవారం మహిళా సంఘాల సభ్యులు ధర్నా చేపట్టారు. బ్యాంక్‌ను మూసివేసి, రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కళ్యాణదుర్గం మండలం మల్లికార్జునపల్లిలో 21 మహిళా పొదుపు సంఘాలు ఉన్నాయన్నారు. అదే గ్రామానికి చెందిన లక్ష్మి యానిమేటర్‌గా వ్యవహరిస్తున్నా.. మొత్తం పనులను ఆమె భర్త ఎర్రిస్వామి చక్కబెట్టేవాడన్నారు. ఈ క్రమంలో మహిళా సంఘాలకు చెందిన సుమారు రూ.60 లక్షలకు పైగా నగదును ఎర్రిస్వామి దోచేశాడని మండిపడ్డారు. బ్యాంక్ సిబ్బంది సహకారంతోనే ఈ అక్రమాలకు ఎర్రిస్వామి పాల్పడ్డాడని ఆరోపించారు. ఇదే అంశంపై గతంలో బ్యాంక్ సిబ్బందిని నిలదీశామని, మేనేజర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పొంతన లేని సమాధానాలతో మోసగాడిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు పోలీసులు జోక్యం చేసుకుని నచ్చచెప్పి ఫిర్యాదు స్వీకరించిన అనంతరం ఆందోళనను విరమించారు.

15 తులాల బంగారం, నగదు అపహరణ

తాడిపత్రి రూరల్: స్థానిక గన్నెవారిపల్లి కాలనీలోని బాలాజీ గార్డెన్‌లో మంగళవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. అనారోగ్యంతో బాధపడుతున్న తన మనవరాలిని పిలుచుకుని వారం రోజుల క్రితం ఇంటికి తాళం వేసి రైతు దస్తగిరిరెడ్డి బెంగళూరులోని ఆస్పత్రికి భార్యతో కలసి వెళ్లాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం తలుపులు తీసి ఉండడాన్ని గమనించిన బంధువుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బెంగళూరులోని దస్తగిరిరెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. బీరువాలో 15 తులాల బంగారం, నగదు ఉన్నట్లుగా ఆయన ద్వారా తెలుసుకున్న పోలీసులు అవి లేకపోవడాన్ని నిర్ధారించారు. ఇంటి యజమాని వచ్చిన తర్వాత ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేస్తామని పోలీసులు పేర్కొన్నారు.

ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్‌పై కేసు నమోదు

తాడిపత్రి రూరల్: స్థానిక గన్నెవారిపల్లి కాలనీలో ఉన్న వెంకటసాయి ఐటీఐ కళాశాల కరస్పాండెంట్ సుధాకర్, ప్రిన్సిపాల్ నారాయణస్వామిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు అప్‌గ్రేడ్ రూరల్ ఎస్ఐ కాటమయ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. తాడిపత్రిలోని సర్ సీవీ రామన్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న విజయ్ కుమార్, వంశీ పోస్టు మెట్రిక్ స్కాలర్ షిప్‌కు అర్హత సాధించి, డ్రా చేశారు. ఈ క్రమంలో వారి వివరాలను పొందుపరిచి వెంకటసాయి ఐటీఐ కళాశాలలో అడ్మిషన్లు చూపిస్తూ పోస్టు మెట్రిక్ స్కాలర్ షిప్‌కు ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ దరఖాస్తు చేశారు. దీనిపై సోషల్ వెల్ఫేర్ అధికారి రాధిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుధాకర్‌తో పాటు నారాయణస్వామిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు వివరించారు.

జీపీఎఫ్ లోన్ మంజూరు చేయండి

అనంతపురం అర్బన్: జీపీఎఫ్ లోన్ మంజూరుకు చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ ట్రెజరీ అధికారి రాణికి ఆల్ ఏపీ ప్రభుత్వ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు విన్నవించారు. జిల్లా ఖజానా కార్యాలయంలోని ఆమె చాంబర్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గౌస్‌పీరా, నాయకులు మహబూబ్‌బాషా, నాగభూషణం తదితరులు మంగళవారం కలసి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. జీపీఎఫ్ స్లిప్‌లు అందుబాటులో ఉన్నా... లోన్ మంజూరు చేయడం లేదన్నారు. ఈ విషయంపై ఖజానా శాఖలో సంప్రదిస్తే సీఎఫ్ఎంఎస్‌లో ఓపెన్ కావడం లేదని చెబుతున్నారని వివరించారు. సమస్యను పరిష్కరించి జీపీఎఫ్ స్లిప్‌లపై లోన్, అలాగే పార్టు ఫైనల్ లోన్ మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగులకు సంబంధించి సస్పెన్షన్ అకౌంట్‌లో ఉన్న మొత్తాలను వారి ఖాతాల్లో జమ చేయించాలని విన్నవించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం.ఎస్.భాస్కర్, ఎస్.వాజిద్‌బాషా పాల్గొన్నారు.

22న సైనిక సంక్షేమ శాఖలో గ్రీవెన్స్

అనంతపురం కార్పొరేషన్: మద్రాస్ రెజిమెంట్‌కు చెందిన మాజీ సైనికులు, వారి కుటుంబసభ్యుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 22న ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ గ్రీవెన్స్ నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా సైనిక సంక్షేమాధికారి ఎ.తిమ్మప్ప మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా సైనిక సంక్షేమ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్న గ్రీవెన్స్‌ను ఉమ్మడి జిల్లాలో ఉన్న మాజీ సైనికులు, వారి కుటుంబసభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాల్య వివాహాలను అరికడదాం

అనంతపురం సెంట్రల్: బాల్య వివాహాలను పూర్తి స్థాయిలో అరికడదామని మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి రామసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. బాల్య వివాహాల నివారణపై మంగళవారం ఐసీడీఎస్ కార్యాలయంలో మత పెద్దలకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, స్కూల్ సర్టిఫికెట్, అంగన్‌వాడీ సెంటర్‌లో నమోదు చేసిన పుట్టిన తేదీ తదితర పత్రాలు పరిశీలించిన తర్వాతే దేవాలయాలు, మసీదులు, చర్చీల్లో వివాహాలు జరిపించాలని సూచించారు. ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి, చైల్డ్ కో ఆర్డినేటర్ కృష్ణమాచారి, ఐసీపీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆకాశమంత చంద్రుడు

ఆకాశంలో అద్భుతం ఆవిష్కృతమైంది. సూపర్ మూన్, బ్లూ మూన్ రెండూ కలబోసి సూపర్ బ్లూ మూన్‌గా అవతరించి చంద్రుడు కనువిందు చేశాడు. రోజూ ఉండే కాంతి కంటే దాదాపు 30 శాతం ప్రకాశవంతంగా, పరిమాణంలో అతి పెద్దగా కనిపించడంతో జిల్లా వాసులు ఎంతో ఆసక్తిగా గమనించారు. దశాబ్దానికి ఒకసారి మాత్రమే ఇలాంటి అరుదైన అవకాశం వస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు. **– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం**

క్లుప్తంగా

నేడు భారత్ బంద్



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నేడు దేశ వ్యాప్తంగా భారత్ బంద్ నిర్వహిస్తున్నామని, బంద్‌ను విజయ వంతం చేయాలని మాల మహానాడు ఐక్యవేదిక అధ్యక్షుడు కోట్ల గంగాధర్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోట్ల గంగాధర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు నిర్ణయం సబబుగా లేదన్నారు. ఈ తీర్పు వల్ల కోట్లాది మంది మాలలు నష్టపోతారనప్నారు. దీనికి వ్యతిరేకంగా మాలలు భారత్ బంద్‌కు పిలుపిచ్చారని పేర్కొన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో బంద్‌కు ప్రజలు మద్దతు ఇవ్వాలన్నారు. ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున బంద్‌లో పాల్గొనాలన్నారు. వ్యాపార కేంద్రలు స్వచ్ఛందంగా సహకరించాలన్నారు. కార్యక్రమంలో రామన్న, కేవీ చలపతి, రంగనాయకులు, బాబు, సుగమంచి శ్రీనివాసులు, పూలకుంట రాము, శివ, లింగమూర్తి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్

అనంతపురం అర్బన్: ఆర్టీసీ కార్గో పోర్టర్స్ కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు సాగిస్తామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ అన్నారు. మంగళవారం స్థానిక సంఘం కార్యాలయంలో ఏఐటీయూసీ నగరాధ్యక్షుడు చిరంజీవి అధ్యక్షతన నిర్వహించిన ఆర్టీసీ కార్గో పోర్టర్స్ కార్మికుల సమావేశంలో రాజేష్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్టీసీ కార్గో కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు, నాయకులు షేక్షావలి, బాషా, బాబా, ఫకృద్దీన్, కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవం



రాఘవేంద్రస్వామి మూలవిరాట్

అనంతపురం కల్చరల్: మంత్రాలయ రాఘవేంద్రస్వామి ఆరాధనా ఉత్సవాల్లో ప్రధాన పర్వదినాలు మంగళవారం నేత్ర పర్వంగా ప్రారంభ మయ్యాయి. స్థానిక మొదటిరోడ్డులోని రాఘవేంద్రస్వామి మఠంలో ప్రత్యేక పూజలు చేశారు. మఠం పరిసరాలలో రథోత్సవం నిర్వహించారు.

ప్రమాదాలు జరగకుండా సమస్య పరిష్కరించండి



రోడ్డుమధ్యలో నిలిచిన వర్షపు నీటిలో నిల్చొని నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

ఆత్మకూరు: మండల కేంద్రంలోని భారత్ గ్యాస్ ఏజెన్సీ ఎదురుగా ప్రధాన రహదారిపై వర్షపునీరు నిలిచి ఉండడంతో చెరువును తలపిస్తోంది. పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు రోడ్డు దాటాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాదచారులు, వాహనదారులు రహదారిపై వెళ్లాలంటే భయపడుతున్నారు. ప్రమాదాలు జరగకుండా సమస్య పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి రామకృష్ణ కోరారు. మంగళవారం సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో వర్షపు నీల్వ ఉన్న రహదారిపై కూర్చొని నిరసన తెలియజేశారు.

నేటి నుంచి విగ్రహ పునః ప్రతిష్ఠాపన

అనంతపురం కల్చరల్: నగరంలోని మారుతీనగర్‌లో వెలసిన కోదండరామాలయంలో 21వ తేదీ నుంచి మూడు రోజుల పాటూ విజయదుర్గాదేవి విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షురాలు జమునా విజయ్‌కుమార్, ప్రధాన అర్చకులు నాగరాజశర్మ తెలిపారు.

23న గ్రామసభలు

ఆత్మకూరు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఈనెల 23 నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివశంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. 2024-2025 సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనుల గుర్తింపు, ఎస్సీ,ఎస్టీ , చిన్న, సన్నకారు రైతులు భూమి అభివృద్ధి పనులు, ఉపాధి హామీ కూలీలకు వంద రోజుల పని కల్పనపై గ్రామసభలు ఉంటాయన్నారు. ఉపాధి హామీ కూలీలు, పంచాయతీ అధికారులు, అధికారులు తప్పక హాజరుకావాలని తెలిపారు.

వర్ష బీభత్సం

- పరవళ్లు తొక్కుతున్న పండమేరు వంక

రాప్తాడు: నియోజకవర్గంలో గత పది రోజులుగా ఓ మోస్తారు వర్షాలు కురుస్తున్నాయి. రెండు, మూడు రోజులుగా భారీ వర్షాలు కురవడంతో మండలంలో వాగులు, వంకలు పొంగిపార్లాయి. దీంతో జనజీవనం స్తంభించింది. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి పండమేరు వంక పొంగి పోర్లుతోంది. పండమేరు వంక ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షపు నీటి ప్రవాహంతో పండమేరు వంక పరవళ్లు తొక్కుతోంది. గత రెండేళ్లుగా సరైన వర్షాలు లేక కళావిహీనంగా తయారైన పండమేరు వంక.. నాలుగైదు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో జలకళ వచ్చింది. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి పండమేరు వంక రాప్తాడు మీదుగా అనంతపురం చెరువులోకి నీరు చేరుతోంది. రామగిరి, కనగానపల్లి మండలాల్లో నుంచి వరద నీరు ప్రవహిస్తూండడంతో పండమేరు వంక నాలుగు అడుగుల నీరు ప్రవహిస్తోంది. మండలంలో వరిమడుగు, గాండ్లపర్తి గ్రామాల సమీపంలోని వంకలో ఉదయం వాహన రాకపోకలు స్తంభించాయి. సాయంత్రానికి ఉధృతి తగ్గడంతో వాహనాలు తిరిగాయి. ఈ వంక వల్ల ఆయా గ్రామాల్లోని చెరువుల్లోకి నీరు చేరాయి. ఈ వంక రెండు రోజులు ప్రవహిస్తే రాప్తాడు మీదుగా అనంతపురం చెరువులోకి నీరు భారీగా చేరుతుందని రాప్తాడు గ్రామస్తులు చెప్తున్నారు. మండల వ్యాప్తంగా ఉన్న వంకలు, వాగులు, కుంటలు, చెక్కు డ్యామ్‌లు పొంగి పొర్లుతున్నాయి.

చెరువును తలపిస్తున్న ముక్తాపురం

కనగానపల్లి: మండలంలోని ముక్తాపురంలో వర్షపు నీరంతా వీధుల్లోనే నిల్వ ఉండటంతో చెరువును తలపిస్తోంది. 44వ నంబరు జాతీయ రహదారికి పక్కనే ఉన్న ఈ గ్రామంలో సరైన రోడ్లు, డ్రైనేజీలు లేవు. దీంతో వర్షాకాలం వచ్చిందంటే వర్షపు నీరంతా వీధుల్లోనే నిల్వ ఉంటోంది. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామంలోని ప్రధాన వీధులని వర్షపు నీటితో నిండిపోయాయి. దీంతో స్థానిక గ్రామస్తులతో పాటు గ్రామ సచివాలయానికి వెళ్లే అధికారులు, వాహనదారులు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



రాప్తాడు మండలం అయ్యవారిపల్లి దగ్గర పారుతున్న పండమేరు వంక



వర్షపు నీటి నిల్వతో చెరువును తలపిస్తున్న ముక్తాపురం



ముక్తాపురం ప్రధాన వీధిలో పారుతున్న వర్షపు నీరు

'పేదల కడుపు మాడిస్తే పుట్టగతులుండవు'

అనంతపురం రూరల్: నెల నెలా పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయకుండా పేదల కడుపు మాడిస్తే పుట్టగతులుండవని సీపీఎం ఒకటవ నగర కార్యదర్శి రామిరెడ్డి మండిపడ్డారు. గత మూడు నెలల నుంచి రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయలేదని నిరసిస్తూ మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట దర్నా నిర్వహించారు. అనంతరం సీఎస్‌డీటీలు శ్రీరాములు, బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మసూద్, శ్రీనివాసులు, మోహన్, వన్నూరమ్మ, మాబూన్నీ, హసీనా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాలికల అథ్లెటిక్స్ పోటీలు

కనగానపల్లి, రామగిరి: ఆర్డీటీ ఆధ్వర్యంలో బాలికల రూరల్ అథ్లెటిక్స్ పోటీలను ఉత్సాహంగా నిర్వహించారు. మంగళవారం నసనకోట మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణలో పోటీలు నిర్వహించారు. పోటీల్లో కనగానపల్లి, రామగిరి మండలాల్లోని ఉన్నత పాఠశాలల విద్యార్థినులు పాల్గొన్నారు. క్రీడాకారులను అండర్- 14, అండర్- 16 విభాగాలుగా విభజించి ఈ పోటీలు నిర్వహించినట్లు పీడీ మాధవరాజులు తెలిపారు.

సందడిగా 'గెట్ టు గెదర్'



కేక్ కట్ చేస్తున్న విశ్రాంత అధికారుల సంఘం నాయకులు

అనంతపురం అగ్రికల్చర్: జేడీఏ, డీడీఏ, ఏడీఏ స్థాయి హోదాలో పనిచేస్తూ రిటైర్డ్ అయిన వ్యవసాయశాఖ గెజిటెడ్ విశ్రాంత అధికారుల అసోసియేషన్ నాయకులు మంగళవారం స్థానిక కృషిభవన్‌లో గెట్ టుగెదర్ నిర్వహించారు. ఈ సందర్భంగా 92 సంవత్సరాలు పూర్తి చేసుకున్న విశ్రాంత ఏడీ రమణ జన్మదిన వేడుక సందర్భంగా కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విశ్రాంత డీడీఏ కృష్ణమూర్తి, కార్యదర్శి విశ్రాంత ఏడీఏ మల్లికార్జున మాట్లాడుతూ... వివిధ హోదాల్లో రిటైర్ అయినా ఇప్పటికీ చాలా మంది రైతులకు సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకుంటూ సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో విశ్రాంత అధికారుల సంఘం నాయకులు రవీంద్రారెడ్డి, ఠాగూర్‌నాయక్, నాగన్న, రామచంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, లోకనాథరెడ్డి, చంద్రాయుడు, విశ్వనాథ్, గురుమూర్తి, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దబోల్కర్ ఆశయాలు కొనసాగిద్దాం

అనంతపురం కల్చరల్: మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా కృషి చేసిన మహనీయుడు దబోల్కర్ ఆశయాలను కొనసాగించాలని జేవీవీ నగర అధ్యక్షురాలు డాక్టర్ ప్రసూన అన్నారు. మంగళవారం స్థానిక సంఘమేష్ నగర్‌లోని జేవీవీ కార్యాలయంలో నరేంద్ర దబోల్కర్ వర్ధంతి సందర్భంగా ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విచ్చేసిన డాక్టర్ ప్రసూన మాట్లాడుతూ కొంత మంది స్వామీజీలు, పాస్టర్లు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకుని వచ్చి శాస్త్రీయ విజ్ఞానం వైపు నడిపించాలని కోరారు. అంతకు ముందు దబోల్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు వీరరాజు, గాంగేనాయక్, లక్ష్మీనారాయణ, బాబ్‌జాన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి చర్యలు



శ్మశాన వాటికను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని డ్రైవర్స్ కాలనీలో ఉన్న ముస్లిం శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని. అందుకు సంబంధించి అంచనాలను సిద్ధం చేసేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీర్లను మేయర్ వసీం ఆదేశించారు. మంగళవారం శ్మశాన వాటికను మేయర్ పరిశీలించారు. శ్మశాన వాటికలో లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. నడవడానికి ఇబ్బంది లేకుండా పార్కింగ్ టైల్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. మేయర్ వెంట ఈఈ సూర్యనారాయణ, జామియా మసీదు ముతవల్లి కేయం షకీల్‌షఫీ, కార్పొరేటర్లు సైపుల్లాబేగ్, కమల్‌భూషణ్, అనిల్‌కుమార్ రెడ్డి, స్థానికులు రవి, బాబావలి న్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మేయర్ వసీం సంబంధిత అధికారులను ఆదేశించారు. మేయర్ వసీం అరవిందనగర్, రాంనగర్, కోవూర్‌నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. దగ్గరుండి పడిపోయిన చెట్లను తొలగించేలా చర్యలు తీసుకున్నారు. అలాగే మురుగు రోడ్లపైకి రావడంతో పారిశుద్ధ్యం మెరుగు చేసేలా సిబ్బందిని ఆదేశించారు.

లోతట్టు ప్రాంతాల్లో సత్వర చర్యలు

లోతట్టు ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం 48వ డివిజన్ రజక్‌నగర్‌లో డిప్యూటీ మేయర్ పర్యటించారు. రజక్‌నగర్‌లోని రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కార్మికులకు బూట్లు, తదితర సామగ్రిని ఆయన అందజేశారు. కార్పొరేటర్ శ్రీనివాసులు, ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి, తదితరులున్నారు.

జీజీహెచ్‌లో రివాల్వింగ్ గేట్ మూసివేత

- ఉద్యోగులు, రోగుల అవస్థలు



ప్రభుత్వ సర్వజనాస్పత్రి వెనుక వైపు రివాల్వింగ్ గేట్ మూసివేయడంతో వేచి ఉన్న రోగులు, వారి సహాయకులు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని అధికారుల అనాలోచిత నిర్ణయాలు రోగులు, వారి సహాయకులు, ఉద్యోగులకు సమస్యలు తెచ్చిపెడుతున్నాయి. ప్రభుత్వ సర్వజనాస్పత్రి వెనుక వైపు ఉన్న రివాల్వింగ్ గేట్‌ను మూసివేయంపై ఉద్యోగులు, రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి ఉన్నఫలంగా ఆస్పత్రి వెనుక వైపు ఉన్న రివాల్వింగ్ గేట్‌ను మూసి వేశారు. దీంతో ఆస్పత్రి వెనుక వైపు నుంచి వచ్చే రోగులు, వారి సహాయకులు, ఉద్యోగులు తీవ్ర అవస్థలు పడ్డారు. దాదాపుగా 500 మందికిపైగా సిబ్బంది షిఫ్టుల వారీగా ఆస్పత్రి వెనుక వైపు గేట్ నుంచి వచ్చేవారు. ఇప్పుడు రివాల్వింగ్ గేట్ మూసివేయడం పెద్ద సమస్యగా మారింది. ఇదే విషయమై సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావును సాక్షి వివరణ కోరగా కలెక్టర్ ఆదేశాలతో మూసి వేసినట్లు పేర్కొన్నారు.

మౌలిక సదుపాయాలకు డీఎంఈ గ్రీన్‌సిగ్నల్



ఎమర్జెన్సీ వార్డుపై భాగాన్ని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

అనంతపురం మెడికల్: కోల్‌కత్తాలో పీజీ వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు సమ్మెలోకి వెళ్లడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పనపై పీజీ వైద్యులు, హౌస్‌సర్జన్లు ప్రభుత్వ తీరును తప్పుబట్టారు. ఈ క్రమంలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పీజీ వైద్యులకు మౌలిక సదుపాయాల కల్పనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వైద్యులకు రూమ్‌లు, వాష్ రూమ్స్, బాత్‌రూంలు ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు తదితరులను ఆదేశించింది. దీంతో మంగళవారం సూపరింటెండెంట్ ఆస్పత్రిలోని క్యాజువాలిటీపై భాగంలో ఉన్న గదులను పరిశీలించారు. అందులో కొన్ని గదులకు తాళం వేసి నిరుపయోగంగా ఉన్నట్లు వారు గుర్తించారు. అదేవిధంగా ఆస్పత్రిలోని వివిధ ప్రాంతాల్లో వారు పర్యటించి పీజీ వైద్యులకు మెరుగైన వైద్య సేవలందించాలని నిర్ణయించారు. అందుకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసేలా ఏపీఎంఎస్ఐడీసీ అధికారులను ఆదేశించారు. సూపరింటెండెంట్ వెంట డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, ఎమర్జెన్సీ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాసులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మహేష్, నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి, ఐసీఎస్‌లు నీలిమ, రేష్మ, శోభ, పసన్న లక్ష్మి, తదితరులున్నారు.

జేఎన్‌టీయూలో ఇంటిగ్రేటెడ్ కోర్సులో అడ్మిషన్లు



ఇంటిగ్రేటెడ్ కోర్సులో ఓ విద్యార్థికి అడ్మిషన్ అందిస్తున్న జేఎన్‌టీయూ వైస్‌చాన్సలర్ సుదర్శనరావు

అనంతపురం కార్పొరేషన్: జేఎన్‌టీయూ అనంతపురం విశ్వ విద్యాలయం, బ్లెకింగ్ వర్సిటీ (స్వీడన్) సంయుక్తంగా ఇంటిగ్రేటెడ్ కోర్సులకు సంబంధించి మంగళవారం ఇన్‌చార్జ్ ఉపకులపతి సుదర్శనరావు ఆధ్వర్యంలో అడ్మిషన్లు నిర్వహించారు. ఒక విద్యార్థికి అడ్మిషన్ పత్రాన్ని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి సుదర్శనరావు మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో భాగంగా బీటెక్ కోర్సు మూడు సంవత్సరాలు అనంతపురం జేఎన్‌టీయూ క్యాంపస్‌లో, ఒక సంవత్సరం బీటీహెచ్ స్వీడన్‌లో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. బీటెక్ డిగ్రీని జేఎన్‌టీయూఏ అనంతపురం, బీఎస్ పట్టాను బ్లెకింగ్ వర్సిటీ(స్వీడెన్) ప్రదానం చేస్తుందన్నారు. విదేశాల్లో ఉద్యోగం సంపాదించడానికి ఇక్కడి విద్యార్థులకు ఇది గొప్ప అవకాశమన్నారు. ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ కంప్యూటర్ సైన్స్‌లో ఈ రోజు ఒక విద్యార్థి అడ్మిషన్ పొందడం జరిగిందన్నారు. స్పాట్ అడ్మిషన్లను ఈ నెల 24 వరకూ పొడిగించడం జరిగిందని రిజిస్ట్రార్ ఎస్ కృష్ణయ్య తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఉపకులపతి డైరెక్టర్ ఆఫ్ ఎఫ్ఏ, ఏఎం ప్రొఫెసర్ పీ సుజాత, అడ్మిషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్ కిరణ్మయి, తదితరులు పాల్గొన్నారు.

వైద్యులపై దాడులు జరగకుండా చూడాలి



ఆప్ జూడాల రిలే దీక్షకు మద్దతు తెలుపుతున్న మేయర్ వసీం

అనంతపురం మెడికల్: కోల్‌కత్తాలో పీజీ విద్యార్థినిపై జరిగిన అఘాయిత్యం అత్యంత దారుణం, యావత్ దేశం సిగ్గుతో తలదించుకునే పరిస్థితి వచ్చిందని మేయర్ వసీం పేర్కొన్నారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆవరణలో ఆప్ జూడా ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మెకు మేయర్ వసీం మద్దతు తెలిపారు. రిలే దీక్షల్లో పాల్గొన్న పీజీ, హౌస్‌సర్జన్లు, వైద్య విద్యార్థులతో కలసి ఆయన టెంట్‌లో అరగంటకుపైగా బైఠాయించారు. విద్యార్థులతో కలసి వీ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలు చేశారు. మేయర్ మాట్లాడుతూ కోల్‌కత్తాలో వైద్యురాలిపై జరిగిన ఘటన చాలా బాధాకరమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. రిలే దీక్షల్లో డాక్టర్ స్వప్న, డాక్టర్ హర్ష, డాక్టర్ నవ్య, హౌస్ సర్జన్‌లు సాక్షి, శిల్ప కూర్చున్నారు. మేయర్ వెంట కార్పొరేటర్లు మల్లెమీద నరసింహులు, కమల్‌భూషణ్, అనిల్‌కుమార్ రెడ్డి, సైపుల్లాబేగ్, న్నారు.

నేడు బైక్ ర్యాలీ

సమ్మెలో భాగంగా బుధవారం నగరంలో భారీ బైక్ ర్యాలీ చేపట్టనున్నట్లు ఆప్ జూడా అధ్యక్షుడు డాక్టర్ హరికిరణ్ పేర్కొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: కోల్‌కత్తాలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనలో నిందితులకు ఉరిశిక్ష విధించాలని అనంతపురం రూరల్ మండలం చియ్యేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టీచర్లు డిమాండ్ చేశారు. స్కూల్ టీచరు, నవ్యంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూడిద నాగేంద్ర ఆధ్వర్యంలో జూనియర్ వైద్యురాలికి సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకట రమణ, ఉపాధ్యాయులు విజయ్, ఉమా మహేశ్వర్, నివేదిత, నాగమణి, భారతి, పుల్లయ్య, భాస్కర్ రెడ్డి, నళినాక్షి , శిరీష, ప్రసాద్ పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిలో స్టాఫ్‌నర్సుల ఉత్తమ సేవలు

- జూడాల సమ్మెతో రౌండ్ ద క్లాక్‌లో 400 మందికిపైగా విధులు



గైనిక్ వార్డులో బాలింతకు ఇంజెక్షన్ వేస్తున్న స్టాఫ్‌నర్సు

అనంతపురం మెడికల్: ఆప్ జూడాల సమ్మెతో రోగులకందించే సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం జరగకుండా ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, నర్సింగ్ సూపరింటెండెంట్లు నాగమణి, రజిని చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ఆస్పత్రిలో విధులు నిర్వర్తించే 400 మందికిపైగా రెగ్యులర్, సీబీ 1, 2, ఇన్‌సర్వీస్ స్టాఫ్‌నర్సులు మూడు షిఫ్టుల్లో రోగుల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఆప్ జూడాలు సమ్మెలోకి వెళ్లడంతో ఆస్పత్రిలో క్యాజువాలిటీ, ఏఎంసీ, మెడిసిన్, ఆర్థో, సర్జరీ, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, ఎమర్జెన్సీ ఓటీ, మెయిన్ ఓటీ, గైనిక్, చిన్నపిల్లల వార్డు, తదితర వార్డులు, వివిధ ఓపీల్లో 3 వేల మందికిపైగా రోగులకు అవిశ్రాంతంగా సేవలందింస్తున్నారు. ముఖ్యంగా హౌస్‌సర్జన్లు, పీజీలు చేసే పేషంట్ కేర్‌ను స్టాఫ్‌నర్సులు చూసుకుంటున్నారు. స్టాఫ్‌నర్సులకు సహాయంగా ప్రైవేట్ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు సేవలందిస్తున్నారు.

కార్తికేయుడికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం కుంకుమార్చన, స్వర్ణకవచ సేవ, నిర్వహించారు. మంజునాథ స్వామికి రుద్రాభిషేకం, పార్వతీదేవికి వడి బియ్యం, ఆకుపూజ, నైవేద్యం, నివేదన మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి బంగారు కవచంతో ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

అలరించిన సంగీత విభావరి

అనంతపురం కల్చరల్: పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నగరంలోని అనంతపురం క్లబ్‌లో సంగీత విభావరి నిర్వహించారు. నిర్వాహకులు సురేష్ బాబు , శ్రీదేవి, ఆదినారాయణ, మారుతీ, సూర్యనారాయణరెడ్డి తదితరులు పాత సినిమా పాటలను అద్భుతంగా ఆలపించి అలరించారు. చిరంజీవి జన్మదినం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎల్కేపి కార్యదర్శి పద్మజ, ఆచార్య సుధాకరబాబు, భవానీ రవికుమార్, రవికాంత్ రమణ తదితరులు ఆత్మీయ అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. స్వయంశక్తితో చిరంజీవి ఎదిగిన తీరు ఎంతో మందికి ఆదర్శప్రాయమన్నారు.

ఫుట్‌బాల్ టోర్నీ విజేత మణిపూర్



ఫుట్‌బాల్ చాంపియన్స్ ట్రోఫీతో మణిపూర్ జట్టు క్రీడాకారులు

అనంతపురం కార్పొరేషన్: జూనియర్ గరల్స్ నేషనల్ టైర్ -1 ఫుట్‌బాల్ చాంపియన్‌గా మణిపూర్ జట్టు నిలిచింది. మంగళవారం ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో మణిపూర్, జార్ఖండ్ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 2-0 గోల్స్ తేడాతో మణిపూర్ జట్టు గెలిచింది. ఆట ప్రారంభం ఉంచి మణిపూర్ క్రీడాకారిణులు దూకుడు ప్రదర్శిస్తూ వచ్చారు. ప్రత్యర్థి జట్టుకు గోల్ చేసే అవకాశం ఇవ్వకుండా చేశారు. 36వ నిమిషంలో మెనియా, 65వ నిమిషంలో రెమీ చెరో గోల్ చేసి జట్టును విజయతీరాలకు చేర్చారు. ఫైనల్‌లో నెగ్గిన మణిపూర్ క్రీడాకారుల ఈలలు, కేకలతో స్టేడియం మార్మోగింది.

ఫుట్‌బాల్‌కు పెరిగిన ఆదరణ

ఫుట్‌బాల్‌కు మంచి ఆదరణ లభిస్తోందని ఆర్డీటీ ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ విశాల ఫెర్రర్ అన్నారు. మంగళవారం ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె విజేత, రన్నర్ జట్ల క్రీడాకారులను అభినందిస్తూ ట్రోఫీలను అందజేసి, మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఎఫ్ఏ ఉపాధ్యక్షుడు ఎస్.వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి డేనియల్ ప్రదీప్, కడప కార్యదర్శి ఎం సుధీర్, అనంతపురం కార్యదర్శి డి.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.